నమస్తే తెలంగాణ
నిజామాబాద్, మంగళవారం 13 మే 2025
TUESDAY, MAY 13, 2025

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

పోతంగల్, మే 12: మండలంలోని జల్లాపల్లి, కల్లూర్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వేను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సోమవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ సమన్వయంతో నిర్వహించాలని, అర్హులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్, వెరిఫికేషన్ అధికారులు నిఖిత, శంకర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో పంటల పరిశీలన

కోటగిరి, మే 12: మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో క్రయ విక్రయాలు, మహారాష్ట్రలో పంటల సాగు, ఉత్పత్తి విషయంలో బాగుందని కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు అన్నారు. కోటగిరి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో సాంగ్లీ మార్కెట్‌ను సందర్శించారు. అక్కడ సాగు చేస్తున్న చెరకు, పసుపు, ఉద్యానవన పంటలను పరిశీలించారు. కోటగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, పాలకవర్గం, సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం

ఇందల్వాయి, మే 12: ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో గంగమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆలయ నిర్మాణం కోసం రూ.40 లక్షల నిధులను కేటాయించనున్నారు. దేవాదాయశాఖలో పూజారి కోసం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆలయ ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామం నుంచి ఆలయం వరకు కల్వర్టు, రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు శేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, నవీన్ గౌడ్, చిన్నబాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైశాఖ పూజలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, మే 12: జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్‌గంజ్ ఉమామహేశ్వరాలయంలో వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం రుద్రాభిషేకాలు, అన్నపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, ఎమ్మెల్యేను సత్కరించారు.

## ముంబైలో నిజామాబాద్ వాసి



ముంబైలో ఉన్న నిజామాబాద్ వాసి

వినాయక్‌నగర్, మే12: నిజామాబాద్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ముంబైలోని విక్రోలి వెస్ట్ ఏరియాలో ఉన్నట్లు నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సదరు వ్యక్తి కొన్ని రోజులుగా ఎవరితో ఏమీ మాట్లాడకుండా ఫుట్‌పాత్‌పై కూర్చొని ఉంటున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారని పేర్కొన్నారు. ఫొటో ఆధారంగా వ్యక్తిని గుర్తిస్తే నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గాని, 87126-59837 నంబర్‌కు ఫోన్ చేసిగానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

## ‘ప్రజావాణి’ ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మే 12: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు ప్రారంభం

డిచ్‌పల్లి, మే 12: మండలంలోని జడ్పీ హెచ్‌ఎస్, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో చదువుతున్న 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణ ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డిచ్‌పల్లి మానవతా సదన్‌లో తహసీల్దార్ ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. డ్యాన్స్ మాస్టర్, సింగర్ అజయ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ డ్రాయింగ్ కల్పన, మ్యాథమెటిక్స్, తెలుగు, ఇంగ్లిష్ బేసిక్స్ నేర్పుతున్న కుమారి విజయలక్ష్మిని విద్యార్థులకు జడ్పీహెచ్‌ఎస్ గెజిటెడ్ హెచ్‌ఎం సీతయ్య పరిచయం చేశారు. సమ్మర్ క్యాంప్ కోఆర్డినేటర్ రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డిని కలిసిన బంజారా నాయకులు

సారంగాపూర్, మే 12: రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇందల్‌నాయక్, శంకర్, గోపాల్, శివరాంనాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాజీ ఎమ్మెల్యే వారితో చర్చించారు.



## గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడు మృతి

వినాయక్‌నగర్, మే12: జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని హమాల్‌వాడికి చెందిన మందుల ఆకాశ్(21) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఆకాశ్ తన స్నేహితుడు దీపక్‌రెడ్డి ఇంట్లో ఆదివారం ఫంక్షన్‌కు హాజరయ్యాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆకాశ్ తన మరో స్నేహితుడు పాంచాలి విజయ్‌ని బైక్‌పై తీసుకెళ్లి ఖలీల్‌వాడిలో వదిలి ఇంటికి వస్తున్నాడు. అర్ధరాత్రి తర్వాత సుమారు 2.30 గంటల సమయంలో జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో బైక్‌పై నుంచి కింద పడిపోయిన ఆకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్సై హరిబాబు పేర్కొన్నారు.

## సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

రుద్రూర్, మే12: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ నాయకుడు నన్నే సాబ్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సంఘం నాయకురాలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

రుద్రూర్ మే12: రాయకూర్ గ్రామంలో ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో సోమవారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదని అన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళల రక్షణ, షీటీంపై అవగాహన కల్పించారు.

## ఎనిమిది కుటుంబాల సాంఘిక బహిష్కరణ

- బాధితుల్లో తాజా మాజీ సర్పంచ్
- పట్టించుకోని పోలీసులు, అధికారులు
- ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

డిచ్‌పల్లి, మే 12: మండలంలోని మిట్టపల్లికి చెందిన ఎనిమిది కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ సాంఘిక బహిష్కరణ చేశారని, వీడీసీపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు పేర్కొన్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయిచైతన్యకు వేర్వేరుగా బాధితులు ఫిర్యాదు అందజేశారు. అనంతరం బాధితులు విలేకరులతో మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్ 15న గణేశ్ నిమజ్జనం సందర్భంగా తంగెళ్ల కిషన్, మాసిపెద్ది శ్రీనివాస్ మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుందని తెలిపారు. తర్వాత కాంగ్రెస్ నాయకుడి అండతో వీడీసీ సభ్యులు మున్నూరు కాపు కులానికి చెందిన ఎనిమిది కుటుంబాలను బహిష్కరించారని అన్నారు. తాము పది నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై ఎండి.షరీఫ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంఘిక బహిష్కరణకు గురైన బాధితులు తేలు గణేశ్ (మాజీ సర్పంచ్), మాసిపెద్ది శ్రీనివాస్, తేలు గంగాధర్, మాసిపెద్ది రవి, ఒడ్డం నర్సయ్య, గోపు రాజేశ్వర్, చిత్తపేట నడ్పి గంగారాం, గోపు చరణ్ పాల్గొన్నారు.

## ‘న్యాయవాదులకు ప్రత్యేక శిక్షణ’

వినాయక్‌నగర్, మే12: న్యాయవాద వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఇండియల్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఐఎల్‌పీఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం దేవరాజ్ గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో ఎదిగేలా కావాల్సిన శిక్షణకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు సాయిని నరేందర్, కృష్ణారెడ్డి మాట్లాడారు. బార్ ఉపాధ్యక్షుడు దిలీప్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకులు ఎ.ఆంజనేయులు, ఎన్.జె.శాంసన్ పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఇందల్వాయి, మే 12: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఉప వైద్యాధికారి తుకారాం రాథోడ్ సోమవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట ఆయుష్ మెడికల్ ఆఫీసర్ భువన, ఆరోగ్య విస్తరణాధికారి శంకర్, నర్సింగ్ ఆఫీసర్ ప్రకాశ్, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.



ఖిల్లా డిచ్‌పల్లి సమ్మేళనమైన 2000-01 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి, మే 12: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 2000-2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ ఒకచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. పూర్వ గురువులను సన్మానించారు.



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామశాఖ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కోతి శేఖర్ రెడ్డి ఆదివారం సాయంత్రం సిరిసిల్లలో కలిశారు. స్థానిక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేటీఆర్‌కు వివరించానని తెలిపారు. రాబోయే రోజులు మనవేనని, రైతులకు అండగా నిలవాలని కేటీఆర్ సూచించారని ఆయన పేర్కొన్నారు. - ధర్పల్లి, మే12

## సంక్షిప్తంగా..

- **రెడ్‌క్రాస్ సేవలను ప్రశంసించిన కలెక్టర్ -** కంఠేశ్వర్, మే 12: రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సేవలందిస్తున్న తోట రాజశేఖర్‌కు జాతీయస్థాయిలో రెడ్‌క్రాస్ అవార్డు వచ్చిన సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. జాతీయస్థాయిలో అవార్డు అందుకున్న తోట రాజశేఖర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో సత్కరించి అభినందించారు.
- **మోతాదుకు మించి యూరియా వాడొద్దు -** డిచ్‌పల్లి, మే 12: పంటల ససాగులో యూరియాను మోతాకు మించి వాడొద్దని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని డిచ్‌పల్లి తండాలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏఈవోలు పాల్గొన్నారు.
- **రాజీవ్ యువశక్తికి 1464 దరఖాస్తులు**
ధర్పల్లి, మే 12: రాజీవ్ యువశక్తి పథకం కింద మండలంలో 1464 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో బ్యాంకుల వారీగా 429 యూనిట్ల లక్ష్యం ఉందని, మొదటి విడుత రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకుల వారీగా త్వరలోనే అభ్యర్థులకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు.
- **15 నుంచి జీలుగ విత్తనాల పంపిణీ-** రుద్రూర్, మే12: పచ్చిరొట్ట ఎరువు తయారీ కోసం జీలుగ విత్తనాలను ఈ నెల 15 నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు తెలిపారు. రాయకూర్ పీఏసీఎస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
- **బంజారా భాషలో ప్రసారాలు చేయాలి-** ఖలీల్‌వాడి, మే 12: ఆకాశవాణి, దూరదర్శన్‌లో బంజారా భాషలో ప్రసారాలు చేయాలని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంజారా భాషలో రోజుకు రెండు గంటలు కార్యక్రమాలు ప్రసారం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు వేముల శేఖర్, మురళి పాల్గొన్నారు.
- **డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి -** ఖలీల్‌వాడి, మే 12: ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ల కోసం తక్షణమే దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సైదా జైనబ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన విద్యార్థినులు తమ కళాశాలను వెబ్‌సైట్‌లో ఎంపిక చేసుకోవాలని, 29న తొలి అడ్మిషన్ల జాబితా విడుదలవుతుందని పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 6 వరకు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.
- **ఇంటర్‌లో .. -**ఇందల్వాయి, మే 12: జిల్లాలోని సీబీఎస్‌ఈ పాఠశాలల్లో ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 14 నుంచి 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఇందల్వాయి ఏకలవ్య బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందల్వాయి ఏకలవ్య బాలికల కళాశాలలో బైపీసీలో 15, సీఈసీలో 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని, గాంధారిలోని బాలుర పాఠశాలలో బైపీసీలో 23, సీఈసీలో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. టెన్త్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తామని పేర్కొన్నారు.
- **ఘనంగా నర్సుల దినోత్సవం-** ధర్పల్లి, మే 12: రోగులకు వైద్య సేవలందించడంతో నర్సుల పాత్ర ఎంతో కీలకమని మండల వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించారు. నర్సులు, వైద్య సిబ్బంది కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

## ఘనంగా బుద్ధపౌర్ణమి

మోర్తాడ్, మే 12 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని మోక్షానంద బుద్ధవిహార్‌లో బుద్ధ పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బుద్ధుని విగ్రహానికి పుష్పాంజలి, పతాక ఆవిష్కరణ, ధ్యానం, దమ్మ ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ సర్వీసెస్ జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు, ఎస్సై విక్రమ్, రవీందర్, రత్నయ్య, శంకర్, సాయిలు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**
General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Banswada Branch, Dist. Kamareddy** agreed to accord Loan to Mohammed Younus S/o. Mohd. Jamaluddin, Age 33 Yrs, Occ: Business, R/o. H.No.10-59, Pangally, Kotagiri (V & M), Nizamabad (Dist) mortgage of the schedule referred property The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(05) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice
**SCHEDULE OF THE PROPERTY**
That the Open Plot No.5 & 18 Lies Land Sy.No.1255/ఇ, 1254/ఆ, 1255/ఈ2/3, 1254/ఇ, of Kotagiri Sivar, situated at Kothapally Road Kotagiri, within the G.P. Limits of Kotagiri, Kotagiri Mandal Parishad, Nizamabad zilla Parishad Under the Jurisdiction of Registration District: Nizamabad and Sub-District: Bodhan.
Plot area Details:
Plot No.05: 2100.00 Sq.Ft/233.333 Sq.yds.
Plot No.18: 2100.00 Sq.Ft/233.333 Sq.yds.
Total 4200.00 Sq.Ft./466.66 Sq.Yds
**Bounded as below : North:**25' Wide Road, **South:** 100' wide PWD Road (Kotagiri-Kothapally) **East**: 30' Wide Road, **West:** Plot No. 04 & 19.
**Sd/- R.JAGADISHWER RAO,** Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

## హున్సాలో బుద్ధ విహార్ ప్రారంభం



సాలూర మండలం హున్సాలో బుద్ధ విహార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్, మే 12 : సాలూర మండలంలోని హున్సా గ్రామంలో ఏర్పాటు చేసిన బుద్ధ విహార్ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన నామకరణ మహోత్సవ కార్యక్రమాన్ని బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా సొసైటీ భవనం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సాలూర ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో బాలేరావు గౌతం, బంగే బుద్ధహోష్, బాగ్యవాన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కంప్యూటర్లు ప్రారంభం..

బోధన్, మే 12: బోధన్ పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల సౌకర్యార్థం కోసం ఏర్పాటుచేసిన కంప్యూటర్లను సోమవారం బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా దవాఖానను ఆయన తనిఖీచేసి రోగులకు అందుతున్న సేవలపై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు సాలూర గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనానికి ఆయన భూమిపూజ చేశారు. అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఎస్సెస్సీలో అత్యుత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను సన్మానించారు.

## స్తంభాన్ని ఢీకొట్టిన కారు.. తృటిలో తప్పిన ప్రమాదం




విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

ఆర్మూర్‌టౌన్, మే 12 : నిర్మల్ జిల్లాకు చెందిన ఎడిటిక కారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆర్మూర్ పట్టణంలోని ధోండి మెడికల్ చౌరస్తా సమీపంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని అక్కడే ఉన్న తూప్రాన్‌కు చెందిన స్కూల్ బస్సును కూడా ఢీ కొట్టి ఆగిపోయింది. అంకాపూర్‌కు చెందిన ప్రవీణ్ కారులో పేషెంట్‌ను దవాఖానకు తీసుకెళ్తూ నెమ్మదిగా మలుపు తీసుకుంటున్న సమయంలో వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోగా, అదృష్టవశాత్తు ఎడిటిక కారులో ఉన్న 10మందికి ఎటువంటి గాయాలు కాలేదని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సోమవారం తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఎడిటిక కారును స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**PASSPORT LOST**
I, JANGABOI BHOOMAIAH S/o. JANGABOI PEDDANNA R/o. H.No.1-110, Abbapoor (V), Navipet (M), Nizamabad (Dist)
నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. F9224819 గలది. బైక్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్: 7780727213
NTZ-338656

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


భీమ్‌గల్, మే 12: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీన తలపెట్టి న దేశ వ్యాప్త సమ్మెను కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారినుద్దేశించి ప్రసంగించారు. అనంతరం భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ భీమ్‌గల్ అధ్యక్షుడు సున్నపు ఓంకార్, కార్యదర్శి నవీన్, సహాయ కార్యదర్శి సాయవ్వ, ఉపాధ్యక్షుడు పోశయ్య, కోశాధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి..

ఆర్మూర్‌టౌన్, మే 12: నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ప్రజా సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలోమాట్లాడారు. ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భీమ్‌గల్, మే 12: మండలంలోని పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాభ్యాసం చేసి స్వర్గస్తులైన గురువులు సుందరయ్య, గంగారాం, వెంకటరమణ, యాకూబ్ ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు.



పల్లికొండలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

## యంచ గోదావరి వద్ద పుష్కర ఘాట్ నిర్మించాలి

నవీపేట, మే 12: మండలంలోని యంచ గోదావరి ఒడ్డున పుష్కర ఘాట్ నిర్మించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు యంచ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. నిత్యం బాసర వెళ్లే భక్తులు యంచ గోదావరి నదిలో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకోవచ్చని, ఈ మేరకు యంచ గోదావరి నది ఒడ్డున ఇవతల పక్కకు పుష్కరఘాట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్ ను కలిసిన వారిలో గ్రామస్తులు ఉన్నారు.

పొగాకు కంపెనీలపై ప్రజావాణిలో రైతుల ఫిర్యాదు..

రెంజల్, మే 12: మండలంలోని బోర్గం గ్రామ పొగాకు ఉత్పత్తి రైతులు పొగాకు కంపెనీల పై సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ గ్రామ పరిధిలో 8 వేల ఎకరాల్లో పొగాకు పంటను పండించామని, ఇప్పటి వరకు పొగాకును కొనుగోలు చేయడం లేదని, ఫలితంగా తాము తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తున్నదని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. గతేడాది వెస్టు, పీటీపీ, ఐటీ సీ, బోమ్‌డాల, కేఆర్‌కే, అలియాన్స్ కంపెనీలు పొగాకును గిట్టుబాటు ధర రూ.13,800 కు మాత్రమే కొనుగోలు చేశాయన్నారు. ఈ ఏడాది 8 వేల ఎకరాల్లో పంట పండించామని, ఎకరానికి రూ. 80 వేలు ఖర్చు చేశామన్నారు. పై కంపెనీలు పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇస్తేనే తాము పంట వేశామని, పంట కోసి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు పేర్కొన్నారు.

## అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి సన్మానం



కీర్తనను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి

మాక్లూర్, మే 12 : మండలంలోని ఓడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి దుద్దు కీర్తనను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి సోమవారం సన్మానించారు. కీర్తన ఇటీవలే తైవాన్ దేశంలో జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొంది. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఓ మారుమూల గ్రామం నుంచి దేశం తరపు న సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొనడం గర్వంగా ఉన్నదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అండగా ఉంటారని ఆమెకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రభాకర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రజినీశ్, అశోక్, చిరంజీవి పాల్గొన్నారు.

## జిమ్ పరికరాల మరమ్మతు

ఆర్మూర్‌టౌన్, మే 12: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న పార్కు, జిమ్ పరికరాలను మరమ్మతు చేయిస్తున్నామని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ బోర్డులో ఉన్న జిమ్, పార్కు పరికరాలు రిపేరు చేయించాలని మున్సిపల్ కమిషనర్ రాజు దృష్టికి తీసుకెళ్లామన్నారు. కమిషనర్ స్పందించి జిమ్ మరమ్మతులను చేయించడంతో పార్కుకు, జిమ్‌కు వచ్చే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

## మర్రిపల్లి భూపతికి సన్మానం

మోర్తాడ్, మే 12 : ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మర్రిపల్లి భూపతి డాక్టరేట్ పట్టాను పొందడంతో సోమవారం డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ పెద్దన్న ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ దశరథ్, అధ్యాపకులు రాజయ్య, భాజన్న, సోని, రమామణి, నవీన్, జయ, గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మోర్తాడ్, మే 12 : కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో మెయిన్‌రోడ్డు నుంచి మల్లన్న గుడి వరకు సీసీరోడ్డు పనులను సోమవారం కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క మంజూరు చేసిన రూ.8లక్షలతో రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికారప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, నాయకులు పడిగెల ప్రవీణ్, నరేందర్, సంజీవ్, ఎర్రన్న, శ్రీనివాస్, జీవన్, వెంకటేశ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు సన్మానం

వేల్పూర్, మే 12 : వేల్పూర్ తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే రెవెన్యూ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు సన్మానించారు.

## గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవీపేట, మే 12: మండలంలోని అల్జాపూర్ గోదావరి నదిలో సోమవారం ఓ గుర్తు తెలియని 45-50 ఏండ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. నదిలో ప్యాంట్, షర్టు లేకుండా డ్రాయర్‌పై కాలికి వల చిక్కుకొని మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని చూస్తే మూడు, నాలుగు రోజుల క్రితం నదిలో పడి మృతి చెందినట్లు కనిపిస్తున్నదన్నారు. ఆచూకీ తెలిస్తే నవీపేట ఎస్సై ఫోన్ నంబర్ 8712659862 కు కాల్ చేయాలని సూచించారు. యంచ గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా చేసి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

## నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

ఎడపల్లి, మే 12 : మండలంలోని జానకంపేట్ గ్రామంలో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తికెళ్లిన ఘటన సోమవారం వెలుగు చూసింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి రవి కుటుంబ సభ్యులు వేసవికాలం ఉక్కపోత దృష్ట్యా ఆదివారం రాత్రి తలుపులు తెరిచి ఆరు బయట భర్త, పిల్లలు, లోపల భార్య నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగుడు ఇంటి లోపలికి ప్రవేశించి రవి భార్య మెడలోనుంచి రెండు తులాల బంగారు గొలుసు కత్తిరించుకొని పారిపోతుండగా బాధితురాలికి మెళకువ వచ్చింది. ఆమె కేకలు వేయగా కుటుంబ సభ్యులు వెంటపడగా దుండగుడు పారిపోయాడు. బాధితుడు ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ‘డయల్ 100’ దుర్వినియోగం చేసిన వ్యక్తికి ఒక రోజు జైలుశిక్ష

బోధన్, మే 12: ‘డయల్ 100’కు తాగిన మత్తులో అనవసరంగా పలుమార్లు ఫోన్‌చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసిన బోధన్ పట్టణం రాకాసిపేట్‌కు చెందిన ఎండీ ఫారూక్ అనే వ్యక్తికి సోమవారం బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్పశాయి ఒక రోజు జైలుశిక్షను విధించారు. ఈ సందర్భంగా బోధన్ టౌన్ సీఐ వెంకట నారాయణ ఒక ప్రకటనలో ‘డయల్ 100’ను ప్రజలు అత్యవసర సమయాల్లో మాత్రమే వినియోగించుకోవాలని, దుర్వినియోగం చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పశువులకు టీకాలు

మాక్లూర్, మే 12 : మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో పశువైద్యం, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమామసాహెర్ తెలిపారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జేవీవో వినీత, జేఎల్‌వో కల్యాణి, వీఏ పాషా, రైతులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన

బాల్కొండ, మే 12 : రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఎ.కృష్ణచైతన్య, ప్రాంతీయ వరి పరిశోధన స్థానిక రుద్రూర్ సాయిప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల రుద్రూర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అనుబంధంతో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి లావణ్య, అధికారులు రేష్మ, నిహారిక, చైర్మన్ ముత్యంరెడ్డి, రోహిత్‌రెడ్డి, ప్రభాకర్, వినాయక్, రైతులు పాల్గొన్నారు.

## మదర్సా స్కూల్‌ను మూసివేయాలి

వేల్పూర్, మే 12 : మండల కేంద్రంలో ఎటువంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న మదర్సాను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పేరుకు స్కూల్ ఉన్నప్పటికీ మతపరమైన ప్రచారాలు నిర్వహిస్తున్నారని వారు ఆరోపించారు. మదర్సా హైస్కూల్‌లో ఈ ప్రాంతానికి చెందిన వారేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి స్కూల్‌లో ఉంటున్నారన్నారు. గతంలో స్కూల్‌పై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఇకనైనా స్కూల్‌ను వెంటనే మూసివేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.